విశాఖ ఎక్స్‌ప్రెస్ వేగంగా వెళ్తోంది.

"అదే సార్ నేను చెప్పేది. ఇప్పుడు మీ కాఫీ నేను తాగుతానా, నా కాఫీ మీరు తాగుతారా? ఎవళ్లదాళ్లే తాగుతాం. ఈమాత్రం దానికి మోసాలెందుకు? అసలు విషయం ఏంటంటే హైదరాబాద్‌లో ఇలాగే తెలతెల్లారేలకు బస్సు దిగానండి. దిగ్గానే నల్ల కళ్లజోడు సొక్కామీద తుడిసేసుకుని పెట్టేసుకున్నానండి. ఏదో కళ్లు బాగుండాలని మొదట్నించీ ఇదెట్టుకోవడం అలవాటండి. ఆ ఎప్పడో పెద్దాపురం మరిడమ్మ తీర్థానికెళ్లినప్పడు రెండొందలెట్టి కొనుక్కున్నా."

బస్సు దిగినాకా మరి సిటీ అన్నాకా ఆటో మాట్లాడుకోవాలి కదా? ఆటోబాబుని పిలిసాను.

"ఎక్కండి సార్" అన్నాడు.

ఆటో ఎక్కి "దిల్‌సుక్‌నగర్ పోనీ" అన్నా

"ఆ" అంటూ నోరెల్లబెట్టాడు. 'పోనీయ్' అంటే కదల్లే.


"తరువాత ఎక్కడికి?" అన్నాడు.

ఈడనుమానం దొంగలు దోలా వివరాలన్నీ సెబితే కానీ కదిలేలా లేడని 'సాయిబాబా గుడి దగ్గరకి' అన్నా. మళ్లీ నోరెళ్లబెట్టాడు.

"ఆ... అంటావేంటి? పోనీయ్" అన్నాను.

"ఓ ఇరవై ఇచ్చుకోండి" అన్నాడు.

"ఎల్లకుండానే బేరాలేంటి?" అంటూ పర్సు తీసి ఇరవై రూపాయలు ఆడి చేతులో పెట్టి అడిగా "హైదరాబాద్‌లో ఆటోవాళ్లు వందలకు వందలు దోచేస్తారంటారు. నువ్వు బొత్తిగా ఇరవయ్యే అడిగావేంటి?" నా అనుమానం నాది.



"నాకంత ఆశ లేదులెండి" అన్నాడు.

"మరింకేటి, పోనీయ్" అన్నాను.

"వచ్చేసింది దిగండి" అన్నాడు.

"ఏంటీ ఇంకా ఆటో కదల్నేలేదు?!" అన్నాను ఆశ్చర్యంగా.

"సౌండ్ ఇనపడిందిగా చాలు, ఇదే దిల్‌సుక్‌నగరు, అదిగో సాయిబాబా గుడి" అన్నాడు. నాకు పిచ్చెత్తుకొచ్చింది.

"ఆ ముక్క ఇందాకే ఎందుకు చెప్పలేదూ" అన్నాను.

"ఆ ముక్క ఆటో ఎక్కకముందడగాల, ఎక్కి, మీటరు తిప్పినాకా కాదు" అనేసినాడు.

"ఇదేటన్నాయం?" అని అరిస్తే నా తరఫున మాట్లాడేవోళ్లు ఒక్కళ్లూ లేరు. సరేనండి, తప్పు నాదేనని వొల్లకుంటాను. మరి దీని మాటేంటి?

మా అల్లుడు ఇంటి నెంబరుతో సహా సాయిబాబా గుడి పక్కనేనని ఎడ్రసిచ్చాడు. తప్పుడుగా అనుకునేరు! ఆడు నాకు మేనల్లుడవుతాడు. 2-3-420 ఇంటి నెంబరు కరెక్టే.

"అల్లుడు" అని కేకేసుకుంటూ లోనికి పోయినాను. లోనికెళ్లగానే నాకు మతిపోయినాదండి! మంచం నిండా చీరలు పరిచున్నాయి. 'ఈడెప్పుడు పెళ్లి చేసుకున్నాడా?' అని అనుకుంటూ "అమ్మాయ్-అమ్మాయ్.." అని కేకెట్టాను.

"బాత్‌రూంలో నీళ్లెట్టినాను, చల్లారి పోతాయి, పోసుకో నాన్నా" అంది లోపల్నించే. అమ్మాయికి మర్యాద మా బాగా నేర్పాడని సంతోషపడి వచ్చినోణ్ని వచ్చినట్టుగానే బాత్‌రూంలోకి పోయినా.

"కాఫీ టిపినీలు ఇక్కడ పెట్టినా, తొందరగా స్నానం చెయ్" అంది అమ్మాయి. అప్పుడు కాఫీ టిపినీలు వచ్చేసినాయంటే మా అల్లుడికి నామీద ఎంత ప్రేమో అనిపించింది. మనసాక్క "అల్లుడేడమ్మా" అన్నా లోన్నుంచి. అమ్మాయికి కోపం వచ్చిందో ఏంటో "ఆయనికి తొంబయ్ పనులు మీ పని మీరు చూసుకోండి. అలమార్లో కొత్త బట్టలు పెట్టాను" అని సిరాగ్గా అనేసి లోనికెళ్లిపోయింది. అల్లుడు కొత్తబట్టలు కూడా తెప్పించాడంటే ఏసుకోకుండా ఎట్లుంటాం చెప్పండి? రెండు చెంబులు దిమ్మరించేసుకునీ, వాసన సబ్బుతో చర్మం తుప్పొదలగొట్టి, అమ్మాయ్ చెప్పినట్లే కొత్త బట్టలేసుకొని టిపినీ చేస్తా కూర్చున్నాను. అప్పుడాయనొచ్చాడు బయట్నించి. ఎవరంటే నాకూ తెలీదు.

ఆయనొస్తేనే "మీరెవరండీ?" అని అడిగాడు.

"అది నే నడగాలే, మీరెవరు?" అనేసినా.

"లింగం, కాంతానికి తండ్రిని" అన్నాడు.

"గ్లాట్టు మీట్ యు.." ఆమాత్రం ఇంగ్లిషొచ్చులెండి.. "నేను కాంతానికి తండ్రిలాటోడ్ని. మీ అల్లుడికి మేనమావని."

"టిపినీలో చెట్నీ అయిపోయింది" అని చెప్పా.

"అమ్మాయ్, చెట్నీ" అని కేకేశాడు లింగం.

కాంతం చెట్నీ తెచ్చి నన్ను చూసి "ఎవరూ?" అంది.

"మీ ఆయనకు మేనమావ, చెట్నీ ఎయ్యి" అన్నాడు లింగం.

"ఆ బట్టలు?" అంటూ ఎగాదిగా చూసింది కాంతం. నాకు మా చెడ్డ కోపం వచ్చింది. "నువ్వేసుకోమని చెప్పినావు కదా! ఏన్నిల్లోసుకున్నాను. కొత్త బట్టలేసుకొన్నాను" అన్నాను. నా కోపానికి లింగం బాధ పడతాడేమోనని, "అమ్మాయి చాలా మర్యాదస్తురాలు తమ్ముడూ" అని సర్దిచెప్పాను..

అప్పుడొచ్చాడు అబ్బాయి. ఎవరంటే నేనేం చెప్పగలను? ఆడు రాగానే "మావయ్యా ఈయనెవరు?" అన్నాడు లింగాన్ని.

"ఆ మాట నేనడగాలి. తమ్ముడూ ఈ కుర్రాడెవడూ?" అని నేనడిగినా.

"మా అల్లుడు, నీకు తెలీదా!?" అన్నాడు నోరెళ్లబెట్టి.

నాకు మా చెడ్డ ఇసిత్రమేసింది.

"ఇదేంటి, ఒకమ్మాయికి ఇద్దరు మొగుళ్లా!" అన్నా. నేనన్న మాటకు కాంతం ఇంతెత్తు లేచింది.

"దొంగసచ్చినోడా నాకిద్దరు మొగుళ్లంటావా? అసలు నువ్వోడివిరా" అంటూ గయ్‌మంది.

"ఒరేయ్ నాయనోయ్ ఎక్కడో తిరకాసొచ్చేసినాది. ఇది మా అల్లుడిల్లేనా కాదా? ఇంటి నెంబరు 2-3-420 కరెక్టగానే ఉందిగా!?" అనుమానిస్తూ అడిగేసినా. మగాలిద్దరూ ఏకమై, కళ్లు పత్తికాయల్లా చేసుకొని "ఈ మేడలో ఇరవై వాటాలుంటాయి. అసలు 420గాడివి నువ్వు బయటికి నడు" అని అరిచేసినారు.

"ముందు ఆ బట్టలిప్పి కదులు" అని కాంతం జబ్బ పట్టుకుని నిలదీసినాది.

"నేనిప్పనంటే ఇప్పను. నా మానం అవమానం అయిపోద్ది. నేను నీళ్లడిగినానా, బట్లడిగానానా, టిపినీలడిగినానా" అంటూ ఎదురుదెబ్బలాటకెళ్లినా.


ఈ గలాటాలో మా అల్లుడు పై నుంచి దిగొచ్చినాడు.

"ఇక్కడున్నావేంటి మావా!" అన్నాడు కంగారుగా.



## గుడ్‌బై చెప్పడంలేదు

ప్రస్తుతం తెలుగులో 'అనసూయ', 'స్వాగతం' చిత్రాల్లో నటిస్తున్న భూమిక తనకి పెళ్లయిపోయింది కను సినిమాలకు గుడ్‌బై చెప్పేస్తున్నానని ఎవరూ భావించనవసరం లేదని, మంచి పాత్రలు వస్తే నటించడానికి సిద్ధమేనని సెలవిస్తోంది. హీరోయిన్ పాత్రలకి తను ఇంకా రెడీయేనట. కానీ పెళ్లయిన హీరోయిన్ల పట్ల ప్రేక్షకుల్లోనూ, ఇండస్ట్రీలోనూ వున్న ఓ రకమైన ఫీలింగ్- భూమికకి హీరోయిన్ వేషాలిప్పిస్తుందా అనే అనుమానాన్ని సినీ జనాలు వ్యక్తం చేస్తున్నారు.



"నాకేం తెలుసు. ఇది నీ ఇల్లే అనుకున్నాను. నీళ్ళోసుకోమంటే పోసుకున్నాను, కొత్తబట్టలున్నాయంటే కట్టుకున్నాను" అని చెప్పేసినా.

"క్షమించండి సార్. మా మావ హైదరాబాద్ రావడం ఇదే మొదటిసారి. రూంకు తీసుకెళ్ళి మీ బట్టలు పంపుతా" అని సర్దిచెప్పి పైకి తీసికెళ్ళినాడు.

నాకు మొదట్లోనే అనుమానం వచ్చింది. నా అల్లుడు నాకింత మర్యాద చేస్తాడా అని. ఆడేదో పెద్ద పొజిషన్లో ఉన్నాడు కదా, నాక్కూడా చిన్న ఉద్యోగం ఏయించకపోతాడాని వచ్చానంతే. ఆ మాటే నాలుగుత్తరాల్లో రాశా.

"ఇప్పుడెందుకు వచ్చావు?" అని అల్లుడు కోపం చేస్తే మళ్ళీ అదే మాట చెప్పా. "ఉజ్జోగం పురుస లక్షణంరా అల్లుడు. నువ్వు బాగుంటే నేను బాగున్నట్టే. అందుకే నీకాడ పనిచెయ్యడానికొచ్చేశా" అని.

ఆడు కోటగుమ్మం దగ్గర రాయిలా బిగుసుకుపోయినాడు. "ఏటంతావ్రా" అని పీకితే మెల్లగా "సర్లే తాళం చెవి పక్కింట్లో ఇచ్చేసి ఆఫీసుకాడికి రా" అని నన్నొదిలేసిపోయినాడు. ఒక మంచి చెడు ఏం మాట్లాడకుండా పోయాడేం టబ్బా అనిపించింది. బడలికతో కాస్సేపు మంచం మీదకొరిగినా.

"సర్లే ఆఫీసుకే పోదాం, పని మనది కదా" అని ఇల్లు తాలమేసి రోడ్డుమీద కొచ్చినా. అటేపు పోతోన్న స్కూటరబ్బాయిని ఆపినా.

"ఎందుకు సార్?" అన్నాడు కంగారుగా ఆ అబ్బాయి మాట అర్థంకాక.

"ఆ నెత్తిమీద కుండ తీసి మాట్లాడు" అన్నా.

"మీరు సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసా?" అన్నాడు.

"ఈ ఊర్లో అందరు ఇలా ఎందుకు కుండలు నెత్తిమీద పెట్టుకుంటారు?" అన్నాను. ఆ అబ్బాయి అనుమానం తీరిపోయింది.

"అయితే నువ్వు పోలీసువు కావా" అంటూ "ఇది హెల్మెట్టు. కింద పడితే తల బద్దలవ్వకుండా. ఆ మాత్రం తెలీదా? అసలు నన్నెందుకు ఆపావు? ఏం కావాలి?" అని వరుసెట్టి అడిగేసినాడు.

సర్లే అదేటయితే నాకెందుకని "బంజారాహిల్స్‌కు దారిటుపోతుందా?" అని అడిగా. "పోతుంది" అన్నాడు.

"మా పక్కింటోడు సోమాజీగూడా నించి పోతుందని చెప్పాడే?"

"దిల్‌సుక్‌నగర్ నుంచి పోతుంది - కోటీ నుంచి పోతుంది. నాంపల్లి నుంచి పోతుంది - సికింద్రాబాద్ నుంచి ముందు నుంచి - వెనుక నుంచి - నన్నొదిలి పెట్టు బాబూ" అంటూ రయ్‌మని పోయాడు.

ఆ ఊళ్లో అందరు తలతిక్క మనుషులే అనిపించింది. సర్లే దేని దారి దాండే నని నడుచుకుంటూ పోయినాను. బంజారాహిల్స్ ఎంతకీ రాదు, అంతకీ రాదే! కాళ్లు గుంజీ, చిరాకొచ్చి ఇంక లాభం లేదని ఆటోని పిలిచి ఎక్కినాను.

"ఎక్కడకి?"

"రోడ్ నెంబరు 12లో రాజా అండ్ కంపెనీకి."

ఈసారి ఆటోవాడు వంద రూపాయలివ్వమన్నాడు. ఇరవై రూపాయలు అడగలేదు కదాని, మోసం లేదని వందిచ్చాను.

"ఇదే రోడ్డు నెంబరు 12, అదే రాజా కంపెనీ, దిగిపో" అనేసినాడు. "మోసం, దగా" అని అరచి లాభమేంటి చెప్పండి? పొద్దునేటయింది? అందుకే గమ్మునే దిగిపోయినా. గదట్లుంచండి. రాజా కంపెనీలోకి పోయి, కాళీ సీటు చూసుకుని "ఇక్కడ కూచోనా అల్లుడు?" అంటే కయ్‌మన్నాడు.

ఇటు చూసి అటు చూసి "కేంటిన్ మేనేజరుజ్జోగం చేసుకో" అన్నాడు.

"ఏంటి చెయ్యాలా?" అంటే "నువ్వే టీ కలపాల, అందరికీ ఏలపట్టున సప్లై చెయ్యాల" అన్నాడు.

నాకు ఆ మాట చెడ్డ అవమానమైపోయింది. ఇంత దూరం వచ్చినా టీ కలుపుకోడమేనా! ఊళ్లో చేసే పని అదేగా. ఇంక అక్కడ ఉండబుద్ది కాక తిరుగు రైలెక్కేసినా. ఒక్క నిముషం ఆగండి. టిక్కెట్టు కలెక్టరుగారు టిక్కెట్టు చూపియ్యమంటున్నారు. ఆళ్లదృష్టిలో అందరూ బేవార్సుగాళ్లే.

"ఇదిగోనండి టిక్కెట్టు."

"ఏ ఊరెళ్తున్నావు?"

"మా ఊరే. జనార్దనపట్నం?"

"ఏ ఊరయ్యా వెళ్లేది?"

"చెప్పాను కదా. అదే తుని కొండలెనకాల ఊరు. అన్నారం నుంచి పక్కనుందీ."

"ఐదొందలు కట్టు"

"ఏంటి ఐదొందలు కడితే ఇంటి వరకు తీసుకొస్తారా రైల్ని?"


"ట్రైను వైజాగ్ వచ్చేసింది. ఇంత దూరం వచ్చినందుకు పెనాల్టీ కట్టాలి."

"నా తప్పేంటి చెప్పండి? ఆ ముక్క అన్నారంలోనే చెబితే దిగిపోయేవాడ్ని కదా? ఏదో ఈ బాబుతో మాటల్లో జర ముందుకొచ్చేశా. ఈ ప్రపంచకం అలా అయిపోయింది. ఆడని లేదు ఈడని లేదు. ప్రసలియిగో, రాసుకోండి. నా పేరు కొండబాబు. తునికొండలెనకాలే మా ఊరు. మా ఊరే మంచిది."

★

## ప్రాణం తీసిన ఇంటర్నెట్

చైనాలోని గువాంగ్ సిటీలో 30 సంవత్సరాల యువకుడు మూడురోజులపాటు అదేపనిగా ఇంటర్నెట్ గేమ్స్ ఆడుతూ స్పృహ తప్పిపోయాడుట. ఏ గేమ్‌వల్ల అతనికలా జరిగిందో ఎవరికీ తెలియదుగానీ అతన్ని హాస్పిటల్‌కు వెంటనే తీసుకెళ్లినా డాక్టర్లు అతడి ప్రాణాల్ని కాపాడలేకపోయారు. ఆటలాడిన అలసటే అతని ప్రాణం తీసిందని వారు చెప్పారు. చైనాలో ఈ



ఇంటర్నెట్ ఎడిక్షన్ ఒక దారుణమైన వ్యసనంగా మారిందని, దానిలోని అనారోగ్య సమాచారాన్ని త్వరగా తొలగించకపోతే నేటి యువత సర్వనాశనమవుతుందని ప్రజలు ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు.

-తటవర్తి

